సాక్షి
మహబూబాబాద్
శనివారం । 20 । మే । 2023



చిలకలగుట్టకు రక్షణ వలయం

- 8లో▸

ములుగు జిల్లాలోని సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు.



21 నుంచి పలు రైళ్ల రద్దు

కాజీపేట-కొండపల్లి రైలు మార్గంలో ఈనెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు పలు రైళ్లు రద్దు కానున్నాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
43.9°/27.6°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వీయ రక్షణ అవసరం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మహబూబాబాద్ రూరల్: ట్రాఫిక్ సిబ్బందికి స్వీయ రక్షణ చాలా అవసరమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ట్రాఫిక్ సిబ్బందికి చలువ కళ్లద్దాలు, థర్మోస్ వాటర్ బాటిళ్లు, గొడుగులను ఎస్పీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ట్రాఫిక్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మజ్జిగ, పండ్లరసాలు తాగాలని సూచించారు. విధి నిర్వహణలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్ ట్రాఫిక్ ఎస్సై భద్రునాయక్, తొర్రూరు ట్రాఫిక్ ఎస్సై రాంజీ నాయక్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంజేడు జాతరలో పిచ్చికుక్కల స్వైర విహారం



కొత్తగూడ: మండలంలోని గుంజేడు ముసలమ్మ జాతరలో భక్తులపై పిచ్చికుక్కలు దాడికి పాల్పడ్డాయి. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చిన భక్తులు వన భోజనాల కోసం వంటలు చేస్తుండగా కుక్కలు ఒక్కసారిగా దాడికి ఎగబడ్డాయి. ఎదురువచ్చిన ప్రతీ ఒక్కరిని కరిచి గాయపరిచాయి. ఈ ఘటనలో కార్లాయి గ్రామానికి చెందిన నవ్య, మొగిలిచర్ల గ్రామానికి చెందిన వీరలక్ష్మి, కామారం గ్రామానికి చెందిన మంజులతో పాటు మరో ఏడుగురికి గాయాలయ్యాయి. జాతరలో పిచ్చి కుక్కలు దాడి చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటికి టికెట్లు వసూలు చేస్తున్న దేవాదాయ, ఫారెస్ట్ శాఖలు పారిశుద్ధ్యం నిర్వహణ, కుక్కలను కట్టడి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులను దోచుకుతింటున్నారు..



గూడూరు: రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ కుటుంబం దోచుకుతింటుంటే.. రైతుల పంటలను మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు మిల్లర్లతో కుమ్మక్కై దోచుకుతింటున్నారని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు అయోధ్యపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి స్వామితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లకు మధ్య మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే హస్తం ఉన్నట్లు గుర్తించి, రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ ధాన్యంగా నిర్వాహకులు బస్తాలు ఎత్తి మిల్లుకు పంపితే, అక్కడ మిల్లర్ తన ఇష్టానుసారంగా సీ గ్రేడ్‌తో డబ్బులు కట్టిస్తున్నాడని పలువురు రైతులు చెప్పిన మాటలకు ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మాసుకోటలోని కొనుగోలు కేంద్రంలో ఇలానే జరిగిందని కలెక్టర్‌కు చెపితే, ఒకే లారీ కదా అంటూ కలెక్టర్ సమాధానం ఇవ్వడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు మొత్తం ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తున్నారని, దీంతో ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నూనావత్ రాధ, మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, మేకల వీరన్న, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తండ యాకాంబ్రంగౌడ్, చంటి స్వామి, కన్నబోయిన వెంకన్న, ముత్యం రవీందర్‌గౌడ్, బాలూనాయక్, రాసమల్ల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

బీపీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్ పరీక్షల (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) టైంటేబుల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు జూన్ 1, 3, 6, 8 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు జూన్ 2, 5, 7, 9 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

వానాకాలం ప్రణాళిక

- సాగు ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 4,47,942 ఎకరాల్లో సాగు
- అత్యధికంగా 2,12,000 ఎకరాల్లో వరి
- 98,600 ఎకరాల్లో పత్తి పంట
- ఎరువులు, విత్తనాల ఏర్పాటుకు చర్యలు



సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో వానాకాలం సాగుపై వ్యవసాయాధికారులు దృష్టిపెట్టారు. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈనెల 25న రోహిణి కార్తె ప్రారంభం కానుండగా.. ఈ కార్తెలో వరినార్లు పోస్తే పంటల దిగుబడి అధికంగా ఉంటుందని నానుడి. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ముందే మేల్కొన్నారు. వానాకాలం సాగు ప్రణాళికను సిద్ధం చేశారు.

4,47,942 ఎకరాల్లో సాగు..

వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 4,47,942 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అంచనాకు వచ్చింది. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో అత్యధికంగా 2.12లక్షల ఎకరాల్లో వరి, 98,600 ఎకరాల్లో పత్తి, 48,850ఎకరాల్లో మొక్కజొన్న, 72,800ఎకరాల్లో మిర్చి పంటలతో పాటు వేరుశనగ, పెసర, కంది, పసుపు, పొగాకు, చెరుకు, జొన్న, నువ్వులు మొదలైన పంటల సాగుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశారు.

విత్తనాలు, ఎరువుల ప్రణాళిక..

వానాకాలం సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువుల ప్రణాళికను సిద్ధం చేశారు. గతంలో మాదిరిగా కాకుండా సాగు సీజన్ మొదలైన నాటి నుంచి చివరి వరకు నెలకు ఎంత మొత్తంలో ఎరువులు, విత్తనాలు అవసరం ఉంటుంది.. అందులో మొదటి వారం మొదలుకొని నాల్గో వారం వరకు వివరాలను తెలుపుతూ ప్రణాళిక రూపొందించారు. ఇలా ప్రణాళిక ప్రకారం 4,47,942 ఎకరాలకు 71,764 క్వింటాళ్ల విత్తనాలు, 1,18,321 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని పేర్కొన్నారు.

కావాల్సిన ఎరువులు (మెట్రిక్ టన్నులు)	
ఎరువు	కావాల్సినవి
యూరియా	35,275.43
ఎంఓపీ	22,397.10
డీఏపీ	26,876.52
కాంప్లెక్స్	33,595.65
ఎస్ఎస్‌పీ	176.38
మొత్తం	1,18,321.08

జిల్లాలో వానాకాలం సాగుకు కావాల్సిన విత్తనాలు		
పంట	విస్తీర్ణం (ఎకరాలు)	కావాల్సిన విత్తనాలు (క్వింటాళ్లు)
వరి	2,12,000	53,000
పత్తి	98,600	1,97,200 ప్యాకెట్లు
కందులు	4,600	184
పెసర	6,417	256
వేరుశనగ	1430	1,144
మొక్కజొన్న	48,850	390
మిర్చి	72,800	72
ఇతర పంటలు	3,245	100

ప్రణాళిక సిద్ధం చేశాం..

రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు. ఈనెల చివరి వారంలో నార్లు పోసుకోవడం, దమ్ము చేసుకునే పనుల్లో నిమగ్నమవుతారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసే విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూసేందేకు ముందుగానే ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాం.

- ఛత్రునాయక్, జిల్లా వ్యవసాయాధికారి

వీఆర్‌ఏల హర్షం

- రెగ్యులరైజ్, పేస్కేల్ అమలుకు కేబినెట్ నిర్ణయం
- జిల్లాలో 500మందికి పైగా లబ్ధి
- సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కురవి: ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలకు సీఎం కేసీఆర్ పేస్కేల్ అమలు చేస్తామని ప్రకటించారు. దీంతో వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో పని చేస్తున్న వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించి పేస్కేల్ అమలు చేయడానికి రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలో వందలాది మందికి లబ్ధి చేకూరనుంది. 506 మంది వీఆర్‌ఏలలో 70 మందిని రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత వీఆర్‌ఏలకు రూ.2వేల వేతనం ఉండేది. తర్వాత రూ.6వేలకు పెంచారు. ప్రస్తుతం రూ.10,500 ఉంది. సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో వీఆర్‌ఏల జీతాలు మెరుగుపడే అవకాశాలున్నాయి. కాగా శుక్రవారం వీఆర్‌ఏలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.



కురవిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

జీవితాలు బాగుపడుతాయి..



తాతముత్తాతల నుంచి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నాం. తెలంగాణ వచ్చాక వీఆర్‌ఏలుగా మార్చారు. ప్రస్తుతం రూ.10,500 వేతనం చెల్లిస్తున్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయం వల్ల ఉద్యోగభద్రతతో పాటు వేతనాలు పెరిగి జీవితాలు బాగుపడుతాయి. పేస్కేల్ అమలు అయితే కుటుంబాలకు భరోసా కలుగుతుంది.

-రెంటాల చంద్రశేఖర్, వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు, కురవి

పేస్కేల్ అమలుతో ధోకాలేదు..



రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకం అయినా వేతనాలు సరిపోక అవస్థలు పడేవాళ్లం. సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించి పేస్కేల్ అమలు చేయడానికి కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం వల్ల మా కుటుంబాలకు భరోసా కలుగుతుంది. సీఎం కేసీఆర్ నిర్ణయం ఎన్నటికీ మరువలేము.

-బాదె వెంకన్న, వీఆర్‌ఏ(రిక్రూట్‌మెంట్), కురవి

'ప్రభుత్వ డిగ్రీ కళాశాల' పేరు మార్పు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరును మాజీ మంత్రి 'నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల'గా మారుస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజు శుక్రవారం తెలిపారు. అదే విధంగా మాజీ మంత్రి రామచంద్రారెడ్డి శతజయంతి సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విగ్రహం ఏర్పాటు, పేరు మార్పునకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ జీఓ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పనులు గడువులోగా పూర్తి చేయాలి

- కలెక్టర్ శశాంక

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో చేపట్టిన మెడికల్ కళాశాల పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాల పనులను సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల పనులు జూలై నెలాఖరు వరకు పూర్తి చేసి అందజేయాలన్నారు. 700 పడకలు, 30 ఎకరాల్లో నిర్మించనున్న మెడికల్ కళాశాల అందుబాటులోకి రానున్నందున పేదలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వైద్య విద్యార్థులకు సౌకర్యాలు సమకూర్చాల్సి ఉన్నందున పనులు నాణ్యతతో వేగవంతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ అధికారి తానేశ్వర్, టీఎస్ఎంఐడీసీ అధికారి ఉమామహేష్, తహసీల్దార్ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎస్పీ శరత్ చంద్రపవార్‌తో కలిసి రోడ్డు ప్రమాదాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం జిల్లాలో 200పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారులు మరమ్మతులు చేసిన తర్వాత రోడ్డు భద్రతా చర్యలు పాటించడం లేదని, ఇకపై ప్రమాదాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఇసుక అందించాలి..

ఇసుక కొరత లేకుండా తక్కువ ధరకే ప్రజలకు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. ఆకేరు, మున్నేరు వాగుల వద్ద ఇసుక లభిస్తున్నందున ఆయా మండలాల్లోని తహసీల్దార్‌లు, ఎస్సైలు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని తొర్రూరు, నెల్లికుదురు, నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ మండలాల్లో ఇసుక డంపులను ఏర్పాటు చేస్తామన్నారు.

రూ.2వేల నోటు రద్దు

- చిల్లర బాధలు తప్పుతాయంటున్న చిరు వ్యాపారుల
- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు



సాక్షి,మహబూబాబాద్/నెహ్రూసెంటర్/మహబూబాబాద్ రూరల్: ఆర్బీఐ రూ.2వేల నోటును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై ప్రజలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మొత్తంలో వ్యాపారాలు చేస్తూ ప్రభుత్వానికి లెక్కలు చెప్పకుండా నల్లధనం కూడబెట్టుకునే వారికి ఆర్బీఐ చేసిన ప్రకటన మింగుడు పడనివ్వడు. అయితే చిరు వ్యాపారులు మాత్రం రూ.2వేల నోటును రద్దు చేయడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద నోట్లు తీసుకుని చిల్లర ఇవ్వడంలో ఇబ్బందులు పడేవారమని, ప్రసుత్తం ఆ సమస్య తీరనుందని అంటున్నారు. కాగా ఆర్బీఐ అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయంతో పెద్ద నోట్లను పెద్దమొత్తంలో ఇంట్లో ఉంచుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా మాఫియా, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ ప్రముఖులు తమ దగ్గర ఉన్న పెద్ద నోట్లను మార్పిడి చేసేందుకు అనుచరులను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు.

రద్దు మంచిదే..



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రూ.2వేల నోటు రద్దు నిర్ణయం అన్ని వర్గాల ప్రజలకు మంచిదే. దాని స్థానంలో రూ. వెయ్యి, రూ.500 నోట్లను మరింతగా చెలామణిలోకి తీసుకురావాలి. పెద్ద నోట్ల కోసం ఎవరు కూడా ఎదురుచూడలేదు. అది ఉన్నంత సేపు ఎవరైనా సరే చిల్లర ఇచ్చేందుకు కూడా ఆలోచించాల్సిన పరిస్థితులు ఉండేవి.

- చిదిరాల ఉమాశంకర్, వ్యాపారి

ఎవరికి ఉపయోగమో అర్థం కావడం లేదు..



రూ.2వేల నోటు రద్దు వల్ల చిరు వ్యాపారం చేసుకునే వారికి ఎలాంటి సమస్యలు ఉండవు. ఒక విధంగా చిల్లర కష్టాలు తీరినట్లే. గతంలో పెద్ద నోట్లు రద్దు చేయడం వల్ల చిరు వ్యాపారులు, పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోమారు రద్దు చేయడం వల్ల ఎవరికి ఉపయోగమో మాత్రం అర్థం కావడం లేదు.

- శౌకత్‌అలీ, చికెన్‌సెంటర్ వ్యాపారి

నల్లధనం బయటకు వస్తుంది



ఆర్బీఐ తీసుకున్న రూ.2 వేల నోటు రద్దు నిర్ణయం ద్వారా బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనం బయటకు వస్తుంది. అక్రమంగా సంపాదించిన వారి చిట్టా బయటకు వస్తుంది. అవినీతిపరుల గుట్టు రట్టవుతుంది. నోట్ల రద్దును స్వాగతిస్తున్నాం.

- సిరికొండ హరికృష్ణాచారి, బంగారం వ్యాపారి

ఇక.. సన్నబియ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యం సరఫరా
- ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారుల్లో ఆనందం
- జిల్లాలోని 1,130 సెంటర్లు

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నప్పటి నుంచి ప్రీ ప్రైమరీ విద్యను బోధించే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అమలు చేయాలనే డిమాండ్ లబ్ధిదారుల నుంచి వినిపిస్తోంది. దొడ్డు బియ్యంతో తయారు చేసిన అన్నం తినేందుకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు విముఖత చూపుతున్నారు. కేంద్రాల్లో వడ్డించినా.. చాలా మంది తినడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం చిన్నారులకు మరింత పోషకాహారం అందించాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సన్నబియ్యంతో కూడిన భోజనం అందించాలని నిర్ణయించింది. ఇటీవల సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపాదిత ఫైల్‌పై సంతకం చేసి ఆమోదం తెలిపారు. ఫలితంగా జిల్లాలోని వేలాది మంది అంగన్‌వాడీ లబ్ధిదారులకు సన్నరకం బియ్యంతో కూడిన భోజనం త్వరలోనే అందనుంది.

కేంద్రాల్లో అమలు తీరు ఇలా..

మూడు సంవత్సరాల నుంచి ఐదేళ్ల చిన్నారులకు రోజూ ఒక గుడ్డు (ఉడకబెట్టింది), 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5 గ్రాముల నూనెతో చేసిన ఆహారం, 20 గ్రాముల మురుకులు, 50 గ్రాముల బాలామృతం అందజేస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు వారికి నెలకు 16 గుడ్లు పంపిణీ చేస్తున్నారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మి పథకం పేరుతో రోజుకు 15 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 200 మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నారు. కాగా మిగతా పోషకాహారం బాగానే ఉన్నా ..దొడ్డు బియ్యంతో వడ్డిస్తుండడంతో తినేందుకు చాలా మంది లబ్ధి దారులు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సన్న బియ్యంతో భోజనం అందించడం ద్వారా లబ్ధిదారులు మరింత ఇష్టంగా తినేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని త్వరగా అమలు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



తొర్రూరు మండలం చెర్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు

సన్న బియ్యం సగటున..

జిల్లా వ్యాప్తంగా ఒక కేంద్రానికి సగటున 65నుంచి 75 కిలోల చొప్పున సన్నబియ్యం సరఫరా కానున్నాయి. గర్భిణులు 7,245 మంది, బాలింతలు 3,229 మంది, చిన్నారులు 31,889 మంది ఉన్నారు. వారందరికీ సెలవు రోజులు మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఒక్కొక్కరికి 150 గ్రాముల చొప్పున బియ్యం వినియోగిస్తారు. చిన్నారుల కోసం 75 గ్రాముల బియ్యం వినియోగిస్తారు.

జిల్లాలోని అంగన్‌వాడీల వివరాలు	
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	1,130
0-3ఏళ్ల పిల్లలు	31,189
గర్భిణులు	7,245
బాలింతలు	3,229

ఆదేశాలు రాగానే అమలు చేస్తాం

అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం నిర్ణయంతో కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల సంఖ్య పెరుగుతోంది. కేంద్రాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేస్తాం.

- వరలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి

ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం



అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షనీయం. చిన్నారులు, మహిళల సంక్షేమం కోసం ఇప్పటికే పలు సంస్కరణలు చేపడుతున్న ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీపై కీలక నిర్ణయం తీసుకోవడం ఆహ్వానించదగింది. ప్రభుత్వ నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతమవుతాయి.

-డాక్టర్ నాగవాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్

మాతృ మరణాలు జరగకుండా చర్యలు

- డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్

నెహ్రూసెంటర్: మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జిల్లాలోని బయ్యారం, కురవి, డోర్నకల్, తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన మాతృ మరణాలకు గల కారణాలపై సమీక్షించారు. ప్రాథమిక స్థాయిలో హైరిస్క్ గర్భిణులు, రక్తహీనత స్త్రీలను గుర్తించి పౌష్టికాహారం తీసుకునేలా చొరవ చూపాలన్నారు. 12 వారాల్లో గర్భిణులను నమోదు చేసుకోవాలని, మొదటి రెండు చెకప్‌లు ప్రాథమిక స్థాయిలో, మూడు, నాలుగు చెకప్‌లు జిల్లా స్థాయిలో గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు ఉమాగౌరి, అంబరీష, వైద్యులు వీరన్న, రాధిక, సాగర్, మానస, విరాజిత, కనకదుర్గ, ఐసీ డిప్యూటీ డెమో కేవీ రాజు, హెచ్‌ఈ మహేందర్‌రెడ్డి, డీపీఎం రుక్ముద్దీన్, అరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్

క్లుప్తంగా

21 నుంచి పలు రైళ్ల రద్దు



డోర్నకల్‌: కాజీపేట– కొండపల్లి రైలు మార్గంలో మూడో లైన్‌ నిర్మాణ పనులతోపాటు, చింతపల్లి, నెక్కొండ స్టేషన్ల మధ్య పనులు జరగనుండటంతో ఈ నెల 21 నుంచి జూన్‌ 7వ తేదీ వరకు కాజీపేట –విజయవాడ మార్గంలో పలు రైళ్లు రద్దు కానున్నాయి.

రద్దు కానున్న రైళ్ల వివరాలు:

07753 కాజీపేట– డోర్నకల్‌
07754 డోర్నకల్‌– కాజీపేట
07755 విజయవాడ– డోర్నకల్‌
07756 డోర్నకల్‌– విజయవాడ
07464 విజవాడ– గుంటూరు
07465 గుంటూరు– విజయవాడ
17660 భద్రాచలంరోడ్‌– సికింద్రాబాద్‌
17659 సికింద్రాబాద్‌– భద్రాచలంరోడ్‌
12713 విజయవాడ– సికింద్రాబాద్‌
12714 సికింద్రాబాద్‌– విజయవాడ
07091 కాజీపేట–తిరుపతి
(మే 23, 30, జూన్‌ 6న రద్దు)
07092 తిరుపతి– కాజీపేట
(మే 23,30, జూన్‌6న రద్దు)
07185 మచిలీపట్నం– సికింద్రాబాద్‌
(మే21, 28, జూన్‌ 4న రద్దు)
07186 సికింద్రాబాద్‌– మచిలీపట్నం
(మే21, 28, జూన్‌ 4న రద్దు)

తాత్కాలికంగా రద్దయ్యే రైళ్లు..

- సిర్పూర్‌ టౌన్‌– భద్రాచలం(17034) 20వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వరంగల్‌, భద్రాచలం మధ్య రద్దు
- భద్రాచలం–సిర్పూర్‌ టౌన్‌(17033) 21వ తేదీ నుంచి జూన్‌ 7వ తేదీ వరకు భద్రాచలం, వరంగల్‌ మధ్య రద్దు
- బెలగావి– మణుగూరు(07335) 20వ తేదీ నుంచి జూన్‌ 6 వరకు కాజీపేట, మణుగూరు మధ్య రద్దు
- మణుగూడు– బెలగావి(07336) 21వ తేదీ నుంచి జూన్‌ 7 వరకు మణుగూరు, కాజీపేట మధ్య రద్దు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఎండదెబ్బకు ఆగిన గుండె



మహబూబాబాద్‌ రూరల్‌ : మహబూబాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గుండమల్ల వెంకటయ్య (67) శుక్రవారం వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఆయన తన వరిచేను వద్దకు వెళ్లి పొలం కోయించి ఇంటికి తిరిగి వచ్చి ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురయ్యారు. ఆ వెంటనే కొంత సమయానికి ఇంటి వద్దే మృతిచెందారు. వెంకటయ్యకు భార్య ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కడిపికొండ భూమి టీఎన్జీవోస్‌దే..!

- ఉద్యోగుల సొసైటీ భూమి వదిలే ప్రసక్తేలేదు
- రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధం
- ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్‌ : ప్రభుత్వ ఉద్యోగుల నివాస స్థలాల కోసం సీఎం కేసీఆర్‌ కడిపికొండలో కేటాయించిన భూమిలోకి వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగుల పై దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడిన అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగులు విరామ సమయంలో జిల్లా కలెక్టరేట్‌ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. నిరసనలో టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్‌ మాట్లాడుతూ.. సీఎం ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం కడిపికొండలో కేటాయించిన 32 ఎకరాల స్థలంలో కబ్జాల విషయం గతంలోనే కలెక్టర్‌, పోలీస్‌ కమిషనర్‌, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉద్యోగులకు కేటాయించిన భూమిని పరిశీలించేందుకు వెళ్లిన ఉద్యోగులపై కొంత మంది దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారని, ఈవిషయాన్ని ఉద్యోగ సంఘాల ఏజేసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉద్యోగుల భూమి ఆక్రమణకు పోత్సహిస్తున్న వారు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈవిషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. దోషులను శిక్షించే వరకు ఉద్యమిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రేక్షక పాత్ర వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేసేందుకు సిద్ధమని తెలిపారు. గెజిటెడ్‌ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌ అన్నమనేని జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదన్నారు. సీఎం స్వయంగా ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్‌ చేస్తున్న కొంతమంది అధికారుల వైఖరి వల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. వెంటనే కలెక్టర్‌, సీపీ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి ఉద్యోగుల భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓ వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్‌, వేణుగోపాల్‌, బూరుగు రవి, ములుగు జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌, నాగరాజు, హౌసింగ్‌ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, సభ్యులు వేణుగోపాల్‌, రమేష్‌, అశోక్‌, శ్యాంసుందర్‌, వెంకట్రామ్‌రెడ్డి, సారంగపాణి, భూక్య రాము, డాక్టర్‌ ప్రవీణ్‌, సురేష్‌, బింగి సురేష్‌, రాజేష్‌ఖన్నా, రాజీవ్‌, అనుప్‌, భరత్‌, ప్రణయ్‌, రాజ్యలక్ష్మి, పావని, శ్రీలత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- లైసెన్స్‌ షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- వ్యవసాయధికారి విజ్ఞాన్‌, ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌



ఎరువులు, విత్తన షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖిలా వరంగల్‌: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయధికారి జి. విజ్ఞాన్‌, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌ ముస్క శ్రీనివాస్‌ హెచ్చరించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు లైసెన్స్‌ ఉన్న షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. శుక్రవారం వ్యవసాయ, పోలీస్‌ శాఖ సంయుక్తంగా వరంగల్‌ ఫోర్ట్‌ రోడ్డులో ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో అందుబాటులో ఉన్న పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఇతర పంటల విత్తనాల ప్యాకెట్లు, పురుగు మందులను పరిశీలించారు. సుమారు 25 విత్తనాల షాపులను తనిఖీ చేసి రికార్డులు, విత్తనాల విక్రయాల అనుమతులు, కంపెనీ గుర్తింపును అడిగి తెలుసుకున్నారు. పలు షాపుల్లో విత్తన నమూనాలను పరిశీలించారు. నిషేధిత విత్తనాల విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ ముస్క శ్రీనివాస్‌, ఏఓ విజ్ఞాన్‌ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లైసెన్స్‌ గల షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బ్రోకర్ల మాయమాటలు నమ్మొద్దని, లూజు పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వారివద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. లైసెన్స్‌ ఉన్న డీలర్ల వద్ద మేలైన విత్తనాలు కొనుగోలు చేసి బిల్లు తీసుకోవాలని, పంట ముగిసే వరకూ భద్రపర్చుకోవాలని చెప్పారు. పంట దిగుబడులు రానిఝడల అధికారులకు తెలిపి పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. విత్తన బ్రోకర్ల మాటలు నమ్మొద్దని వ్యవసాయాధికారులు సూచించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి మంచి దిగుబడులు సాధించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుమన్‌, సాంబయ్య, కుమార్‌, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకాంత్‌, సిబ్బంది పాల్గొన్నారు.

'నిట్‌'ల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న నిట్‌ వరంగల్‌ డైరెక్టర్‌ బిద్యాధర్‌ సుబుదీ

కాజీపేట అర్బన్‌: దేశ వ్యాప్తంగా 31 నిట్‌ల బలోపేతానికి కృషి చేసేందుకు నిట్‌ వరంగల్‌లోని బోస్‌ సెమినార్‌ హాల్‌లో శుక్రవారం టు వర్డ్స్‌ ఎఫెక్టీవ్‌ మేనేజ్‌మెంట్‌ ఆఫ్‌ నిట్స్‌ అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. నిట్‌ డైరెక్టర్‌ బిద్యాధర్‌ సుబుదీ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, మాట్లాడారు. దేశవ్యాప్త నిట్‌లను ప్రపంచ స్థాయికి తీర్చిదిద్దేందుకు పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని అన్నారు. నిట్‌ల బలోపేతానికి దేశవ్యాప్త నిట్‌లను ఏకం చేసేందుకు నిట్‌ వరంగల్‌ ముందడుగు వేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్‌ కళాశాల ప్రారంభోత్సవంలో 1959లో తొలి ఇంజనీరింగ్‌ కళాశాలగా నాడు ఆర్‌ఈసీ నేటి నిట్‌ దేశ వ్యాప్త 31 నిట్‌లకు పెద్దన్నగా నిలుస్తుందని నిట్‌ రూర్కేలా రిటైర్డ్‌ డైరెక్టర్‌, ప్రొఫెసర్‌ సునీల్‌కుమార్‌ సారంగి తెలిపారు. న్యూ ఎడ్యుకేషనల్‌ పాలసీ–2020 అనుగుణంగా విద్యాబోధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నిట్‌ రూర్కేలా డైరెక్టర్‌ ఉమామహేశ్వర్‌రావు, నిట్‌ వరంగల్‌ రిజిస్ట్రార్‌ గోవర్ధన్‌రావు, ప్రొఫెసర్లు వీరాంజనేయులు, దేశవ్యాప్త నిట్‌ల డైరెక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌ కార్యాలయాల్లో బదిలీలు..?

- సోమవారం ఉత్తర్వులు వెలువడే అవకాశం

కాజీపేట అర్బన్‌ : ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని 12 సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో సబ్‌ రిజిస్ట్రార్లతో పాటు జిల్లా రిజిస్ట్రార్ల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్‌ సెక్రటరీ , రిజిస్ట్రేషన్‌ శాఖ కమిషనర్లతో కూడిన ఓ కమిటీ బదిలీల ప్రక్రియపై కసరత్తు ప్రారంభించనట్లు తెలిసింది. కాగా, ఉమ్మడి వరంగల్‌ జిల్లాలకు చెందిన గ్రేడ్‌–1, గ్రేడ్‌–2 మూడేండ్లు నిండిన సబ్‌ రిజిస్ట్రార్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్‌ హైదరాబాద్‌కు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో శుక్రవారం బదిలీల సమాచారం చర్చనీయాంశంగా మారింది. దీంతో కొందరు బదిలీలకు బ్రేక్‌ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నట్లు వినికిడి.

గంజాయి విక్రయదారు అరెస్టు



నిందితుడి అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

వరంగల్‌: ఎల్‌బీ నగర్‌లోని జియా మసీదులో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ.. వరంగల్‌ బస్టాండ్‌ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న అమన్‌ హాజీజ్‌ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి అమ్మకాలు, వినియోగం గురించి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంతేజార్‌గంజ్‌ పోలీసులతో కలిసి కమిషనర్‌ టాస్క్‌ ఫోర్స్‌ వరంగల్‌ బస్టాండ్‌ సమీపంలో గంజాయి విక్రయాలు, వినియోగంలో పాల్గొంటుండగా హాజీజ్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి కిలో 200గ్రాముల ఎండు గంజాయి, మొబైల్‌ ఫోన్‌, మోటార్‌ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. హజీజ్‌ గత ఏడాది నుంచి గంజాయి విక్రయాలు, సేవించడం అలవాటు చేసుకుని, వరంగల్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్‌ పోలీసులకు నిందితున్ని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, కె.జనార్దన్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్‌, నిస్సార్‌పాషా, బి.శరత్‌, సిబ్బంది పాల్గొన్నారు.

బోల్లోనిపల్లిలో కుల బహిష్కరణ

- భూమి రిజిస్ట్రేషన్‌ చేయడంలేదని కుల పెద్దల నిర్ణయం
- పాలు పోయకూడదని హుకుం జారీ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

నల్లబెల్లి: కుల సంఘానికి రాసిచ్చిన భూమి రిజిస్ట్రేషన్‌ చేయించడంలేదని ఓ కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించిన ఘటన వరంగల్‌ జిల్లా నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బోల్లోనిపల్లికి చెందిన తిప్పని పెద్దసారయ్య గౌడ్‌ గ్రామానికి చెందిన గీతకార్మిక సంఘంలో చిట్టీ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నాడు. చిట్టీ డబ్బులు తీసుకున్న ఇద్దరు సభ్యులు కొన్నాళ్ల తర్వాత మృతి చెందారు. వీరితోపాటు మరికొందరు సభ్యులు సంఘానికి చెల్లించాల్సిన చిట్టీ డబ్బు ఇవ్వలేదు. దీంతో సంఘం పెద్దలు పెద్ద సారయ్యను బాధ్యుడిగా చేస్తూ నువ్వే చెల్లించాలని 20 ఏళ్ల క్రితం తీర్మానం చేసి ఎకరం భూమిని బలవంతంగా ఆక్రమించుకున్నారు. ఈ భూమిని గౌడ సంఘం పేర రిజిస్ట్రేషన్‌ చేయాలని కుల పెద్దలు గట్టు సమ్మయ్య, తిప్పని రవీందర్‌, లింగమూర్తి, మాదాసు ఐలయ్యలతో పాటు పలువురు పెద్ద సారయ్య కుటుంబంపై ఒత్తిడి చేస్తూ మానసికంగా వేధిస్తున్నారు. ఇదిలా ఉండగా పెద్ద సారయ్య కుమారుడు శ్రీనివాస్‌ తన భూమిని ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా విషయం తెలుసుకున్న కుల పెద్దలు అక్కడికి చేరుకొని అడ్డుకుని.. సంఘానికి రాసిచ్చిన భూమిని రిజిస్ట్రేషన్‌ చేసే వరకు భూమిని దున్నకూడదని బెదిరించారు. అందుకు అంగీకరించకపోవడంతో రిజిస్ట్రేషన్‌ చేసే వరకు పెద్ద సారయ్య కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు నిర్ణయించారు. వారితో మాట్లాడితే రూ.5 వేలు జరిమానా చెల్లించాలని, పాలు కూడా పోయకూడదని హుకుం జారీ చేసినట్లు బాధితుడు పెద్ద సారయ్య పేర్కొన్నాడు. ఈ విషయమై ఎస్సై నైనాల నగేష్‌ను సంప్రదించగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు పరికి కొర్నేల్‌, బట్టు సాంబయ్య, బొట్ల నరేష్‌ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్‌: కాజీపేట టౌన్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలోని వడ్డేపల్లి చెరువు కట్ట రైల్వే ట్రాక్‌ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్‌ దయాసాగర్‌ తెలిపిన వివరాల ప్రకా రం .. సుమారు 59 ఏళ్ల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 5.4 ఎత్తు, చామన ఛాయ, తెలుపు రంగు చొక్కాపై ఎరుపు గీతల లైన్లు, బూడిద రంగు ప్యాంట్‌, ఎడమ చేతిపై డీఏఆర్‌ అని పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్‌ స్టేషన్‌ 9493201968లో సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల పట్టాలు వచ్చేవరకు పోరాడతాం

- సీపీఎం నేత నాగయ్య



నినాదాలు చేస్తున్న నాగయ్య, నాయకులు

కరీమాబాద్‌: పేదల ఇళ్లకు పట్టాలు వచ్చే వరకు పోరాడతామని సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు జి.నాగయ్య అన్నారు. ప్రతీ పేదవాడికి కూడు, గూడు కోసం పోరాడేది సీపీఎం పార్టీయేనన్నారు. కరీమాబాద్‌ సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భట్టుపల్లి రోడ్‌లోని రాజీవ్‌ గృహకల్ప కాలనీలోని గుడిసెల ప్రాంతాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు సందర్శించారు. పార్టీ జెండా ఆవిష్కరణ చేసి కాలనీకి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం నగర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. పేదలు వేలాది రూపాయల కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు సంబంధించి ఎన్నికల వాగ్దానం ప్రకారం జీఓ 58 ద్వారా పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్‌ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు హామీలకే పరిమితమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి మరోసారి పేదలను మోసం చేయడానికి కుటిల బుద్ధితో పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. గుడిసెల పోరాటంలో మహిళలదే కీలకపాత్ర ఉంటుందని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా మహిళలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగయ్య, రత్నమాల, ముక్కెర రామస్వామి, సాగర్‌, యాదగిరి, బషీర్‌, అరుణ్‌కుమార్‌, మధుకర్‌, మల్లయ్య, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలతో ముందుకెళ్లాలి

ఖిలా వరంగల్‌: భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలతో సీపీఎం శ్రేణులు, యువత ముందుకెళ్లాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్‌ శంభునిపేటలో ఓ ఫంక్షన్‌ హాలులో సీపీఎం రంగశాయిపేట ఏరియా కమిటీ కార్యదర్శి మాలోతు సాగర్‌ అధ్యక్షతన పుచ్చలపెల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. కార్మికుల కూలి రెట్ల పెంపు కోసం ఉద్యమాలు చేసిన ఘన ఆయనకే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ప్రత్యూష, సాంబమూర్తి, గణేపాక ఓదెలు, లక్క రమేష్‌, రత్నం దాసు ,జ్యోతి, గజ్జ చందు, ఉసిల్ల కుమార్‌ పాల్గొన్నారు.

చిలకలగుట్టకు రక్షణ వలయం

- ఫెన్సింగ్‌ ఏర్పాటుకు శ్రీకారం
- పూజలు నిర్వహించిన పూజారులు, అధికారులు



చిలకల గుట్ట (ఫైల్‌)



పూజలు చేస్తున్న ట్రైబల్‌ ఈఈ హేమలత

ఎస్‌ఎస్‌ తాడ్వాయి: ములుగుజిల్లాలోని ఎస్‌ఎస్‌ తాడ్వాయి మండలంలో సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. చిలకల గుట్టపై కొలువుదీరిన సమ్మక్క తల్లిని పూజారులు ప్రతీ రెండేళ్లకు ఒకసారి కుంకుమ భరణి రూపంలో గద్దె పైకి తీసుకొస్తుంటారు. తల్లి కొలువుదీరిన పవిత్ర గుట్టకు రక్షణగా అధికారులు చుట్టూ ఫెన్సింగ్‌ ఏర్పాటుకు తల్లివారం (ఈనెల 18) గురువారం పూజారులు, అధికారులు కలిసి పూజలు నిర్వహించారు. గతంలో కొంతమేరకు ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసి వదిలేశారు. గుట్టకు ఫెన్సింగ్‌ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని మంత్రులు, అధికారులను పూజారులు ప్రతి జాతరలో కోరుతున్నారు. ఎట్టకేలకు ఫెన్సింగ్‌ ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టడంతో పూజారులు, భక్తుల కల నెరవేరనుంది.

రూ.60లక్షల నిధులు..

ట్రైబల్‌ వెల్ఫేర్‌ డిపార్ట్‌మెంట్‌ ఆధ్వర్యంలో చిలకలగుట్ట చుట్టూ 425 మీటర్ల పొడువున ఇనుప ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసేందుకు రూ.60 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో గుట్ట చుట్టూ ఫెన్సింగ్‌ ఏర్పాటు పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సమ్మక్క తల్లి కొలువుదీరిన గుట్టపైకి భక్తులు, స్థానిక ప్రజలు ఎక్కడం వల్ల అపవిత్రం అవుతుందని పూజారుల నమ్మకం. గత నాలుగు జాతరల క్రితం గుట్ట చుట్టూ కొంత మేర (600 మీటర్ల) వరకు జాలి ఫెన్సింగ్‌ ఏర్పాటు చేశారు. మిగిలిన ఫెన్సింగ్‌ పనులు ఈ సారి పూర్తి చేయనున్నారు. 2024, ఫిబ్రవరిలో జరిగే మహాజాతరకు ముందుగానే ట్రైబల్‌ వెల్ఫేర్‌ డిపార్ట్‌మెంట్‌ ఆధ్వర్యంలో చిలుకలగుట్టకు రక్షణ కవచం పనులు మొదలయ్యాయి. దీంతో తల్లి గుట్టకు రక్షణ లభించనుంది.

పవిత్రమైన గుట్టను కాపాడేందుకే..

సమ్మక్క తల్లి స్వయాన కొలువు ఉన్న చిలకలగుట్ట పైకి భక్తులు, ప్రజలు ఎక్కేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అంతే కాకుండా గుట్టపై వనమూలికలు కూడా ఉన్నాయని, వాటిని సేకరించేందుకు కొందరు గుట్టను ఎక్కేందుకు ప్రయత్నిస్తుంటారు. మహాజాతర సమయంలో మిగతా రోజుల్లో వచ్చే భక్తులు చిలుకలగుట్ట వద్ద సేదతీరి వంటావార్పు చేసుకుంటే మోక్షం కలుగుతుందని విశ్వాసం. దీంతో భక్తులు ఎక్కువ మంది గుట్ట పరిసరాల్లో విడిది చేస్తుంటారు. భక్తులు, ఇతరులు గుట్ట పరిసరాల్లో వేసిన వ్యర్థాలు, మలమూత్ర విసర్జన చేయడంతో అపరిశుభ్రంగా తయారవుతాయి. ఫెన్సింగ్‌ ఏర్పాటుతో ఎవరు కూడా గుట్టపైకి వెళ్లేందుకు వీలుండదు. ఫెన్సింగ్‌ ఏర్పాటుతో సమ్మక్క, సారలమ్మ పూజారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి..



చిలుకలగుట్ట చుట్టూ పూర్తిస్థాయిలో ఫెన్సింగ్‌ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పెద్దలు, అధికారులకు విన్నవించగా, ఇప్పటికి కార్యరూపం దాల్చడంతో పూజారుల కల నెరవేరనుంది. మహాజాతర సమయంలో చిలుకలగుట్ట పైకి పూజారులు తప్ప మిగతా ఎవరు కూడా వెళ్లకూడదు. కానీ ఇన్ని రోజులు ఫెన్సింగ్‌ లేకపోవడంతో మేడారానికి వచ్చే భక్తులు గుట్టపైకి ఎక్కేందుకు ప్రయత్నించడంతో గుట్ట అపవిత్రమవుతుంది. ఫెన్సింగ్‌ పటిష్టంగా ఉండేలా అధికారులు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు